సాక్షి
తూర్పుగోదావరి

గురువారం । 24 । ఆగస్టు । 2023

I



అన్నదాన ట్రస్టుకు విరాళం

ఐ.పోలవరం: మురమళ్ల వీరేశ్వరస్వామి అన్నదాన ట్రస్టుకు వడ్లమాని విశ్వనాథం, కడియం రమేష్ బాబు, వడ్లమాని వెంకటరామశాస్త్రి, వడ్లమాని అన్నపూర్ణమ్మ రూ.25వేల వంతున బుధవారం విరాళం సమర్పించారు.



డెల్టాలకు నీరు

ధవళేశ్వరం: బ్యారేజి నుంచి బుధవారం తూర్పు డెల్టాకు 4800,మధ్య డెల్టాకు 2400,పశ్చిమ డెల్టాకు 6000క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు

అగ్రస్థానంలో జేఎన్‌టీయూకే



సాంకేతిక వర్సిటీల్లో జేఎన్‌టీయూకే అగ్రస్థానంలో నిలుస్తుందని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ హేమచంద్రారెడ్డి పేర్కొన్నారు. జేఎన్‌టీయూకేలో బుధవారం వర్సిటీ 15వ వ్యవస్థాపక దినోత్సవ నిర్వహించారు.

II లో

రేరాజును చేరిన రోజు

- చంద్రయాన్‌-3 సక్సెస్‌తో ఆనందోత్సాహాలు
- టీవీలకు అతుక్కుపోయి వీక్షించిన ప్రజలు
- జిల్లావ్యాప్తంగా మిన్నంటిన సంబరాలు



రాజమహేంద్రవరం : షిర్డీసాయి స్కూల్‌లో విద్యార్థుల ఆనందోత్సాహం





ఆనం కళాకేంద్రంలో కేక్ కట్ చేస్తున్న జేసీ తేజ్ భరత్

నెట్‌వర్క్: ఔను.. ఈ క్షణం ..భారత అంతరిక్ష చరిత్రలో వజ్రాక్షరాలతో లిఖించదగ్గది. యావత్ ప్రపంచం ఉత్కంఠకు తెరదించి ఆనంద డోలికల్లో తేలియాడించింది. చంద్రయాన్ – 3 ప్రత్యక్ష ప్రసారాన్ని తిలకిస్తూ టీవీలకు అతుక్కుపోయిన జనం కళ్లు ఒక్కసారిగా ఆనందబాష్పాలు వర్షించాయి. మన ఇస్రో పంపిన ల్యాండర్ మాడ్యూల్ సరిగ్గా బుధవారం సాయంత్రం 6.04 గంటలకు చంద్రుడి దక్షిణ ధ్రువంపై ఘనంగా తన పాదాన్ని మోపిన అద్భుత దృశ్యాలను టీవీ తెరలపై వీక్షించిన జిల్లావాసుల ఆనందం చందమామను తాకింది! భారత వైజ్ఞానిక రంగ ప్రయోగాలలో అత్యంత ముఖ్యమైన ఈ చంద్రయాత్ర విజయవంతం కావాలని కోరుతూ జిల్లావ్యాప్తంగా దేవాలయాల్లో ఉదయం నుంచి పలువురు పూజలు నిర్వహించారు. విద్యాలయాల్లో అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తమ సృజనాత్మకతను ఉపయోగించి పలు రూపాల్లో ఇస్రోకు శుభాకాంక్షలు తెలిపారు. సాయంత్రం చంద్రయాన్ –3 సక్సెస్ అయిందన్న శుభవార్త తెలియగానే మన భారతదేశ శాస్త్రవేత్తల ప్రజ్ఞను జనం వేనోళ్ల కొనియాడారు. చంద్రుడి దక్షిణ ధ్రువంపై అడుగిడి, జెండా పాతిన తొలి దేశంగా భారత దేశ కీర్తిని రెపరెపలాడించిన వారికి శుభాకాంక్షలు తెలుపుతూ పలుచోట్ల ర్యాలీలు నిర్వహించారు. ఒకరికొకరు షేక్‌హ్యాండ్‌లు ఇచ్చుకున్నారు. ఆలింగనాలు చేసుకున్నారు. జాతీయ పతాకాలను చేతబూని, దేశభక్తితో ఉప్పొంగిన గుండెలతో జై భారత్, జైజై భారత్, జయహో ఇస్రో అంటూ వీధుల్లో ఊరేగింపులు నిర్వహించారు.



అన్నవరంలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ర్యాలీ

విద్యార్థుల విజయాస్వాదన

చంద్రయాన్‌-3 విజయవంతం కావడంతో జిల్లా వ్యాప్తంగా విద్యార్థులు ఆనందోత్సాహాలు వక్తం చేశారు. రాజమహేంద్రవరంలోని ఆనం కళాకేంద్రంలో ప్రెస్‌క్లబ్ ఆధర్యంలో ఎల్‌సీడీపై ప్రత్యక్ష ప్రసారాన్ని ఏర్పాటు చేశారు. ఇన్‌చార్జి కలెక్టర్ తేజ్‌భరత్, మున్సిపల్ కమిషనర్ దినేష్‌కుమార్, విద్యార్థులు, ఉపాధ్యాయులు హాజరయ్యారు. సామర్లకోటలోని స్థానిక బచ్చుఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్ ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేశారు. అమలాపురంలోని సర్ సీవీ రామన్ స్కూలు విద్యార్థులు కేరింతలు కొడుతూ సంబరాలు చేసుకున్నారు.

ఈ- పోస్ట్ ద్వారా ఇస్రోకు శుభాకాంక్షలు

రామచంద్రపురం: చంద్రయాన్‌-3 విజయవంతంపై ఇస్రోకు శుభాకాంక్షలు తెలిపేందుకు తపాలా శాఖ ఈ-పోస్టు సౌకర్యాన్ని కల్పించినట్లు రాజమహేంద్రవరం పోస్టల్ సూపరింటెండెంట్ పి.కోమల్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా రామచంద్రపురం ప్రధాన తపాలా కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఇస్రో శాస్త్రవేత్తలకు శుభాకాంక్షలు తెలిపే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ నెల 24 నుంచి 26వ తేదీ వరకు ప్రత్యేక ఈ పోస్టు కౌంటర్ ఏర్పాటు చేశామన్నారు. రూ.10తో ఈ పోస్టు సౌకర్యం ఉంటుందని వివరించారు.

మన సత్తా తెలిసింది



చంద్రయాన్ – 3 ప్రయోగం విజయవంతం కావడంతో భారతదేశం ప్రతిష్ట మరింత పెరిగింది. ఈ ప్రయోగం ఇండియన్ శాస్త్రవేత్తల సత్తా ఏమిటో రుజువు చేసింది. ఈ విజయాన్ని ఇస్రో శాస్త్రవేత్తలు సాధించారంటే ప్రతి భారతీయుడికి గర్వకారణం. భావితరాలు స్ఫూర్తిగా తీసుకుని సైన్స్ వైపు కూడా అడుగులు వేసేందుకు అవకాశం ఉంటుంది.

– ఆచార్య కె.పద్మరాజు, ఉపకులపతి, ఆదికవి నన్నయ యూనివర్సిటీ

టీమ్ వర్క్ ద్వారా డ్రీమ్ వర్క్



సమష్టిగా కృషి చేస్తే విజయం సాధించవచ్చని ఇస్రో శాస్త్రవేత్తలు నిరూపించారు. కలిసి పనిచేస్తే దేశం గర్వించే విధంగా ప్రపంచ దేశాలను ఆకర్షించే స్థాయిలో గొప్ప విజయాలను అందుకోవచ్చు. ఎన్నో సంవత్సరాలుగా ఇస్రో శాస్త్రవేత్తలు చేస్తున్న ప్రయత్నం ఫలించింది. చంద్రుడి దక్షిణ ధ్రువం వైపు ఇంతవరకు ఏదేశం కూడా చేరలేదు, ఇది ఒక చారిత్రక ఘట్టం.

– డాక్టర్ వి.పెర్సిస్, డైరెక్టర్, ఆదికవి నన్నయ యూనివర్సిటీ

సువర్ణ ఘట్టం



చంద్రయాన్‌-3 విజయవంతం అవ్వడం అంతరిక్ష చరిత్రలో సువర్ణ ఘట్టంగా చెప్పవచ్చు. నాలుగేళ్లుగా శాస్త్రవేత్తలు చేస్తున్న కృషి ఫలించింది. దక్షిణ ధృవంపై అడుగుపెట్టిన తొలి దేశంగా భారత్ నిలుస్తుంది. జీరో డిగ్రీ కంటే ఉష్ణోగ్రత తక్కువగా ఉన్న అక్కడ దిగడానికి కారణం మన శాస్త్ర సాంకేతికతే. అక్కడ ఉన్న ఐసను మనం కరిగించినట్లయితే నీరు వస్తుంది. తద్వారా ఆ ప్రాంతం మంతా జీవరాశులు నివసించడానికి అవకాశం ఉండి మరో కొత్త ప్రపంచం ఏర్పడుతుంది. చంద్రుడిలో మొత్తం ఏమున్నది అన్నది ఇప్పటి వరకూ ఎవరికీ తెలియదు. ఈ పరిశోధన ద్వారా తెలుసుకోవడానికి అవకాశం ఉంటుంది.

– డాక్టర్ ఎ.గోపాలకృష్ణ, డిజైన్ ఇన్నోవేషన్ సెంటర్ డైరెక్టర్, జేఎన్‌టీయూకే

పరిశోధకులకు ఉత్సాహం



చంద్రయాన్‌-3 విజయవంతం భావి పరిశోధకులకు మంచి ఉత్సాహవంతమైన ఆశయాన్ని కలిగిస్తుంది. రోజు రోజుకు పెరుగుతున్న జనాభాకు భూమి సరిపోని నేపథ్యంలో అడవులు నరికివేసి పర్యావరణానికి ముప్పు కలిగిస్తున్నాం. ఇటువంటి కొత్త ఆవిష్కరణల ద్వారా అక్కడ జీవించడానికి పరిస్థితులు ఏవిధంగా అనుకూలంగా ఉన్నాయి వంటి వివరాలు పూర్తిగా తెలుస్తాయి. ముఖ్యంగా గ్రహాలు ఎలా ఏర్పడ్డాయి, ఎన్ని ఏళ్ల క్రితం వచ్చాయి వంటి పూర్తి వివరాలతో పాటు ఈ భూ ప్రపంచంలో లేని ఖనిజాలు లేదా ఇతర కొత్త విషయాలు అక్కడ ఏమైనా ఉన్నాయా అన్న వాటిపై స్పష్టత వస్తుంది.

– డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు, వీసీ జేఎన్‌టీయూకే

న్యూస్‌రీల్

కొత్తగా 8,706 బియ్యం కార్డుల జారీ

రాజమహేంద్రవరం సిటీ: రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా జిల్లాలో 8,706 బియ్యం కార్డులను మంజూరు చేసిందని జిల్లా జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్ బుధవారం తెలిపారు. ఆహార భద్రత చట్టం–2013 లో భాగంగా జనవరి 2023 నుంచి జూలై వరకు దరఖాస్తు చేసుకున్న వారికి వలంటీర్ల ద్వారా బయోమెట్రిక్ తీసుకుని ఈ కార్డులు అందజేస్తామన్నారు. వీరికి ఈ ఏడాది సెప్టెంబర్ నుంచి మొబైల్ డెలివరీ వాహనాల ద్వారా నిత్యావసరాలను ఇంటి వద్దనే పంపిణీ చేస్తారన్నారు. జిల్లాలోని మొత్తం 5,64,555 బీపీఎల్ బియ్యం కార్డుదారులకు సెప్టెంబర్ నుంచి ఎండీయూల ద్వారా 84,225.90 క్వింటాళ్ల బియ్యం పంపిణీ చేయనున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2023–24 మార్కెటింగ్ సీజన్ కోసం ధాన్యం కనీస మద్దతు ధరలను (ఫెయిర్ యావరేజ్ క్వాలిటీ) నిర్ణయించిందని జేసీ తెలిపారు. ధాన్యం క్వింటాల్ కనీస మద్దతు ధర సాధారణ రకానికి రూ.2183, గ్రేడ్ ఏ రకానికి రూ.2,203 ప్రకటించారన్నారు.

రేపు మెగా జాబ్ మేళా



విలేకరులతో మాట్లాడుతున్న ఎంపీ భరత్ రామ్, చిత్రంలో అనపర్తి ఎమ్మెల్యే సూర్యనారాయణ రెడ్డి

రాజమహేంద్రవరం రూరల్: నగరంలోని మార్గాని ఎస్టేట్స్ ప్రాంగణంలో శుక్రవారం మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఎంపీ మార్గాని భరత్ రామ్ తెలిపారు. మేళాకు సుమారు 70 కంపెనీలు వస్తున్నాయని, దాదాపు 700 నుంచి 800 మందికి ఉద్యోగావకాశాలు కల్పించాలనే సంకల్పంతో ఉన్నామన్నారు. తోపుడు బండ్లపై వ్యాపారాలు చేసుకునే వారికి పీఎం స్వానిధి పథకం ద్వారా బ్యాంకుల నుంచి ఆర్థిక సాయం అందజేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. చిరు వ్యాపారులు ఆధార్ కార్డుతో పాటు, వ్యాపారం నిర్వహిస్తున్న తోపుడు బండి ఫొటోతో కలిసి దరఖాస్తును నగర పాలక సంస్థ కార్యాలయంలో అందజేయాలన్నారు. ప్రధాన మంత్రి ఎంప్లాయిస్ గ్యారంటీ స్కీమ్ కింద ఇండస్ట్రీ ఏర్పాటుకు రూ.1 లక్ష నుంచి రూ.50 లక్షల వరకు రుణ సదుపాయం కల్పించనున్నట్లు వెల్లడించారు.

అనపర్తికి ఆర్వోబీ

అనపర్తి రైల్వే స్టేషన్ వద్ద ఎల్‌సీ గేట్ మూసివేసి, ఆర్వోబీ నిర్మించేందుకు కేంద్రం ప్రభుత్వం అంగీకరించిందని, ఈ మేరకు రైల్వే శాఖ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయని ఎంపీ భరత్ రామ్ తెలిపారు. ఎమ్మెల్యే సత్తిసూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ జన్మభూమి రైలు హాల్ట్ విషయంలో ఎంపీ భరత్ రామ్ కృషి అభినందనీయమన్నారు. సిటీ కోఆర్డినేటర్ గూడూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రకాశం నగర్: ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మార్గాని ఎస్టేట్స్‌లో జరిగే జాబ్‌మేళాకు 19 ఏళ్ల నుంచి 30 ఏళ్లలోపు సంవత్సరాల లోపు పదోతరగతి, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ చదివిన వారు అర్హులని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎం.కొండలరావు తెలిపారు. ముందుగా టీటీఈఆర్.కామ్ జాబ్ మేళా 250823లో తమ వివరాలతో రిజిస్టర్ అవ్వాలన్నారు. వివరాలకు 91339 12947, 63027 81314 నంబర్లను సంప్రదించాలన్నారు.

దేశానికే గర్వకారణం : ఎంపీ భరత్

చంద్రయాన్ 3 మిషన్ విజయవంతం కావడం దేశానికే గర్వకారణమని ఎంపీ అన్నారు. ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు.

టంగుటూరి జీవితం స్ఫూర్తిదాయకం



ప్రకాశం పంతులు చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న జేసీ తేజ్ భరత్ తదితరులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జీవితం స్ఫూర్తిదాయకమని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్, జేసీ ఎన్.తేజ్ భరత్ అన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం టంగుటూరి ప్రకాశం పంతులు జయంత్యుత్సవం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జేసీ మాట్లాడుతూ టంగుటూరి ఆశయాలను భావితరాలకు అందించే ప్రయత్నంలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. ప్రకాశం పంతులు రాజమహేంద్రవరంలో లా చదివారన్నారు. రాజమహేంద్రవరం పురపాలక సంఘం చైర్మన్‌గా పనిచేశారన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జి.నరసింహులు, కలెక్టరేట్ ఏవో బీవీఎస్ రామారావు, సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థ భేష్

జలజీవన్ మిషన్ సెంట్రల్ టీమ్ ప్రశంస

సీతానగరం: దేశంలో ఏ రాష్ట్రంలో లేని సచివాలయ వ్యవస్థ ఆంధ్రప్రదేశ్‌లో బాగా పని చేస్తోందని జలజీవన్ మిషన్ సెంట్రల్ టీమ్ రిటైర్డ్ ఛీఫ్ ఇంజనీర్లు సౌమిత్ర సేన్‌గుప్త, జీఏ బేగ్‌లు కొనియాడారు. మిర్తిపాడులో జలజీవన్ మిషన్ కింద చేపట్టిన ఇంటింటికీ కుళాయి పథకాన్ని బుధవారం ఈ టీం సందర్శించింది. రూ.63 లక్షలతో ఏర్పాటు చేసిన 90 వేల లీటర్ల సామర్థ్యమున్న వాటర్ ట్యాంక్, బోరు, పైపులైన్లు, ట్యాప్‌లను పరిశీలించింది. ప్రజల నుంచి అభిప్రాయాలను అడిగి తెలుసుకుంది. పంచాయతీ రికార్డులను పరిశీలించింది. అనంతరం టీం సభ్యులు ఇక్కడి గ్రామ సచివాలయ వ్యవస్థ గురించి అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరి శుభ్రమైన నీటిని తాగాలని. ..ప్రతి ఇంటికి తాగునీటిని చేర్చడమే జలజీవన్ మిషన్ లక్ష్యమన్నారు. గ్రామంలో సరఫరా అవుతున్న నీటిని ఎఫ్‌టీకే కిట్ల ద్వారా ఎప్పటికప్పుడు నాణ్యత పరీక్షించాలన్నారు. ఇక్కడ సచివాలయ వ్యవస్థ చాలా బాగుందని సెంట్రల్ టీమ్ రిటైర్డ్ ఛీఫ్ ఇంజనీర్లు సౌమిత్ర సేన్‌గుప్త, బేగ్‌లు కొనియాడారు. అనంతరం పంచాయతీ ఆవరణలో మొక్కలను నాటారు. జలజీవన్ మిషన్ పనులపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ఎస్ రవికుమార్, జేఈ వి అవినాష్, సర్పంచ్ బంగారు సత్యవతి, ఎంపిటీసి మాకిరెడ్డి దేవి, పంచాయతీ కార్యదర్శి విజయదుర్గ, సచివాలయ సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



మిర్తిపాడులో ప్రజాభిప్రాయ సేకరణలో జలజీవన్ మిషన్ సెంట్రల్ టీమ్ సభ్యులు

స్మార్ట్‌గా బోధన

- విద్యా రంగంలో డిజిటల్ సంస్కరణలకు శ్రీకారం
- ప్రభుత్వ పాఠశాలల్లో స్మార్ట్ పాఠాలు
- దృశ్య, శ్రవణ విధానంలో పాఠ్యాంశాల బోధన
- జిల్లా వ్యాప్తంగా 297 పాఠశాలల్లో అమలు
- 386 ఐఎఫ్‌పీ, 1,099 స్మార్ట్ టీవీల ఏర్పాటు
- బోధనపై ఉపాధ్యాయులకు శిక్షణ



రాయవరం మండలంలో ..



చాగల్లు మండలం ఊనగట్ల ఉన్న పాఠశాలలో డిజిటల్ బోధన

సాక్షి, రాజమహేంద్రవరం: విద్యా బోధన మరింత అర్థవంతం చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇందుకు గాను ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ బోధనను పరిచయం చేస్తోంది. దృశ్యం, శ్రవణం ద్వారా పాఠ్యాంశాలు బోధించడం బోధన, అభ్యసన సామర్థ్యాలను పెంపొందిస్తోంది. విద్యా విధానంలో తీసుకువచ్చిన మార్పులు విద్యా ప్రమాణాల ఉన్నతికి ఎంతగానో దోహదం చేస్తున్నాయి. కేవలం పుస్తకాలు చూసి బోధించడమే కాదు.. వాటిని దృశ్యం రూపంలో చూపిస్తుండటంతో విద్యార్థులు పాఠ్యాంశాలను సులువుగా గుర్తుపెట్టుకుంటున్నారు. పరీక్షలు అవలీలగా రాసేస్తున్నారు. తద్వారా మంచి ఉత్తీర్ణత శాతం సైతం నమోదవుతోంది.

జిల్లాలో ఇలా..

జిల్లా వ్యాప్తంగా 984 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. అందులో 706 ప్రాతమిక, 86 ప్రాథమికోన్నత, 192 ఉన్నత పాఠశాలలున్నాయి. వీటిలో మొత్తం 1,07,430 మంది విద్యార్థులు వివిధ తరగతుల్లో విద్యను అభ్యసిస్తున్నారు. విద్యా రంగంలో సమూల మార్పులకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి శ్రీకారం చుట్టారు.'నాడు–నేడు'తో పాఠశాలల రూపురేఖలు మార్చారు. కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దారు. పాఠశాలల్లో ఆహ్లాదకర వాతావరణాన్ని తీసుకువచ్చారు. కేవలం వాతావరణమే కాదు' విద్యార్థులకు అర్థవంతమైన విద్య అందిన నాడే సంపూర్ణ విద్యా వికాసం సాకారమవుతుందని భావించి డిజిటల్ విద్యకు నాంది పలికారు. పోటీ ప్రపంచంలో అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని ముందుకు వెళుతున్నారు. ప్రభుత్వ బడుల విద్యార్థులు కార్పొరేట్ పాఠశాలల విద్యార్థుల కంటే వెనుకబడకుండా ఉండేలా విద్యా ప్రమాణాలను పెంపొందిస్తోంది.

అధునాత సాంకేతిక పరిజ్ఞానంతో..

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా బోధనకు అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నారు. డిజిటల్ తరగతులతో అర్థవంతమైన విద్య సాగుతోంది. గతంలో డిజిటల్ తరగతి గదులు పాఠశాలకు ఒకటి మాత్రమే ఉండేది. అది కూడా జిల్లా పరిషత్ పాఠశాలల్లోనే ఉండేది. ఉన్నా పూర్తి స్థాయిలో వినియోగించుకోలేని పరిస్థితి. అలాంటి పరిస్థితికి చరమగీతం పాడిన ప్రభుత్వం..విద్యార్థులు పూర్తి స్థాయిలో పాఠ్యాంశాలను వింటూ, చూస్తూ నేర్చుకునేలా సమూల మార్పులు తీసుకువచ్చింది. ఈ క్రమంలోనే ఇందులో భాగంగానే ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ (ఐఎఫ్‌పీ), స్మార్ట్ టీవీలను పాఠశాలల్లో ఏర్పాటు చేస్తోంది.

విద్యా బోధనలో నూతన ఒరవడి



ప్రభుత్వం అమలు చేస్తున్న డిజిటల్ విద్యా విధానంతో విద్యా బోధనలో నూతన ఒరవడి నెలకొంది. ఐఎఫ్‌పీ ప్యానెల్స్ ఏర్పాటుతో ఉపాధ్యాయులు పాఠ్యాంశాలు బోధించే విధానంలో పూర్తిగా మార్పు వచ్చింది. దృశ్య, శ్రవరణ రూపకంగా చెప్పడం, బొమ్మల ద్వారా వివరించడంతో విద్యార్థులు పాఠశాలకు రావాలన్న జిజ్ఞాస పెరుగుతోంది. పాఠాలు సులువుగా అర్థం అవుతుండటంతో మానసిక ఒత్తిడికి గురికాకుండా ఉంటున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇప్పటికే 297 పాఠశాలల్లో డిజిటల్ తరగతులు నిర్వహిస్తున్నాం. కార్యక్రమం పకడ్బందీగా అమలయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం.

– ఎస్.అబ్రహం, డీఈఓ

297 పాఠశాలల్లో అమలు

తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా తొలి దశలో 297 పాఠశాలల్లో డిజిటల్ విద్యా బోధన అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగా 1,099 స్మార్ట్ టీవీలు, 386 ఐఎఫ్‌పీలు అమర్చారు. వీటిలో బోధన కొనసాగిస్తున్నారు. ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్‌పై విద్యార్థులకు పాఠాలను బోధించేందుకు ఉపాధ్యాయులకు ఇప్పటికే శిక్షణ ఇచ్చారు. సులభతరంగా, అర్థమయ్యే రీతిలో పాఠాలు బోధించే విధంగా తీర్చిదిద్దారు. ప్రస్తుతం ఐఎఫ్‌పీ ప్యానెల్స్, స్మార్ట్ టీవీల ద్వారా సులభతరంగా, సరళంగా, అర్థమయ్యే రీతిలో బోధన పాఠశాలల్లో సాగుతోంది. విద్యార్థులకు అవసరమైన బొమ్మలు, వీడియోలు, మెటీరియల్స్‌ను ప్యానెల్స్ ద్వారా వీక్షిస్తున్నారు.

పాఠ్యాంశాలు అర్థవంతం

పదో తరగతి విద్యార్థులకు డిజిటల్ బోధన బాగా ఉపయోగపడుతోంది. పుస్తకాల్లో చూస్తూ ఉపాధ్యాయులు చెప్పే పాఠానికి, తెరపైకి గ్రాఫిక్స్ రూపంలో కనిపించే పాఠానికి భేదం ఉంటోంది. గ్రాఫిక్స్ విధానంతో విద్యార్థులకు సులువుగా పాఠాలు అర్థం అవుతున్నాయి. ప్రతి ఒక్కటీ కంటికి కనిపిస్తోంది. గతంలో సైన్స్ సబ్జెక్టులో పాఠ్యాంశాలు ఇలా ఉంటాయని ఊహించుకునే వారు. ప్రస్తుతం మానవ శరీరంలోని భాగాలు, విశ్వం ఇలా ఉంటాయని నేరుగా స్క్రీన్‌మీద చూడగలుగుతున్నారు. చదవడం కంటే.. చూసింది సులువుగా గుర్తుండిపోతోందన్న అభిప్రాయం విద్యార్థుల నుంచి వ్యక్తమవుతోంది. ప్రధానంగా గణితం, భౌగోళిక స్థితి, మొక్కలు, వాటి కణజాల పరిణామక్రమం, జీవ పరిణామం అన్ని కళ్లకు కట్టినట్లు దర్శనమిస్తుండటంతో పాఠం సులువుగా అర్థం అవుతోంది.

జిల్లాలో ప్రభుత్వపాఠశాలలు	:	984
విద్యార్థులు	:	1,07,430
ప్రాథమిక పాఠశాలలు	:	706
విద్యార్థులు	:	30,170
ప్రాథమికోన్నత	:	86
విద్యార్థులు	:	10,524
ఉన్నత	:	192
విద్యార్థులు	:	66,736
డిజిటల్ బోధన అమలు చేస్తున్న పాఠశాలలు	:	297
ఐఎఫ్‌పీ ప్యానల్స్	:	386
స్మార్ట్ టీవీలు	:	1,099

క్లుప్తంగా

తెలుగు విశ్వ విద్యాలయం కీర్తి పురస్కారానికి అలీ ఎంపిక



మామిడికుదురు: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం ప్రతి ఏడాది వివిధ రంగాల్లో నిష్ణాతులైన వారికి అందించే కీర్తి పురస్కారానికి నగరం గ్రామానికి చెందిన ప్రముఖ మెజీషియన్ అలీని ఎంపిక చేసింది. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి 45 మందిని ఎంపిక చేయగా ఇంద్రజాలం నుంచి మెజీషియన్ అలీని ఎంపిక చేశారు. విశ్వ విద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య తంగెడ కిషన్‌రావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సంఘం తనను ఎంపిక చేయడం ఎంతో ఆనందంగా ఉందని మెజీషియన్ అలీ బుధవారం సంతోషం వ్యక్తం చేశారు. త్వరలో నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్‌లోని వర్సిటీ ప్రాంగణంలోని ఎన్టీఆర్ కళామందిరంలో జరిగే ఉత్సవంలో కీర్తి పురస్కారంతో పాటు రూ.5,116 నగదు ప్రోత్సాహం అందిస్తారని అలీ తెలిపారు. అంతర్జాతీయ మెజీషియన్‌గా ఎన్నో అవార్డులు అందుకున్న అలీ కీర్తి పురస్కారానికి ఎంపిక కావడంపై అతని స్వగ్రామం నగరంలో పలువురు హర్షం వ్యక్తం చేశారు. అలీని అభినందించారు.

అగ్రస్థానంలో జేఎన్‌టీయూకే

ఉన్నత విద్యామండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): సాంకేతిక వర్సిటీల్లో జేఎన్‌టీయూకే అగ్రస్థానంలో నిలుస్తుందని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ హేమచంద్రారెడ్డి పేర్కొన్నారు. జేఎన్‌టీయూకేలో బుధవారం ఉదయం వర్సిటీ 15వ వ్యవస్థాపక దినోత్సవాన్ని నిర్వహించారు. వేడుకలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ కె.హేమచంద్రారెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేయగా ఉప కులపతి ప్రొఫెసర్ జీవీఆర్ ప్రసాదరాజు కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ముందుగా వర్సిటీ తొలి వీసీ డాక్టర్ అల్లం అప్పారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ కె.హేమచంద్రారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని సాంకేతిక విద్యకు జేఎన్‌టీయూకే, జేఎన్‌టీయూఏ విశ్వవిద్యాలయాలు మూలస్తంభాలుగా నిలుస్తున్నాయన్నారు. ప్రస్తుత కాలంలో సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యారంగం, పరిశ్రమల మధ్య అంతరాన్ని పూరించాలని అనుబంధ కళాశాలల యాజమాన్యాలకు అధ్యాపకులకు పిలుపునిచ్చారు. విద్యార్థికి అవసరమైన సమాచారం ఎక్కడి నుంచైనా అందిపుచ్చుకునే సాంకేతికత అందుబాటులో ఉన్న నేపథ్యంలో అన్ని వనరులను వినియోగించుకునేలా వారిని ప్రోత్సహించాలన్నారు.



జేఎన్‌టీయూకే పూర్వ విద్యార్థి, సబ్‌కలెక్టర్ యశ్వంత్‌కుమార్‌రెడ్డిని సత్కరిస్తున్న ఉన్నత విద్యామండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి, వీసీ ప్రసాదరాజు

రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థలో తీసుకువచ్చిన సంస్కరణల ద్వారా విద్యార్థులు ఉన్నతమైన విద్యనభ్యసించి ఆత్మవిశ్వాసంతో సమాజంలోకి రావాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆకాంక్ష అన్నారు. విద్యార్థులు ఇంటర్న్‌షిప్ చేయడం ద్వారా పరిశ్రమలు ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించవచ్చునని, తద్వారా వారికి ఉపాధి అవకాశాలు మెండుగా లభిస్తాయన్నారు. అధ్యాపకులు మరిన్ని పరిశోధనలు చేపట్టేలా వారిని ప్రోత్సహించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. రాష్ట్రంలో మొట్టమొదట న్యాక్ ఏప్లస్ గ్రేడ్ సాధించిన జేఎన్‌టీయూకే అధికారులను, అధ్యాపకులను, సిబ్బందిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

ఆరు నెలల్లో అభివృద్ధి పనులు పూర్తి

ఉపకులపతి జీవీఆర్ ప్రసాదరాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర ఉన్నత విద్యామండలి సహకారంతో విశ్వవిద్యాలయంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. విశ్వవిద్యాలయంలో చేపట్టిన రహదారులు, డ్రైన్ల నిర్మాణం, స్నాతకోత్సవ భవనం, వసతి గృహాలు తదితర నిర్మాణాలు మరో ఆరు నెలల్లో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనుబంధ కళాశాలలు ఎంత బాగుంటే యూనివర్శిటీ కూడా అంతే అభివృద్ధి బాటలో పయనిస్తుందని, కళాశాలలు మెరుగైన న్యాక్ గ్రేడ్ సాధించాలని సూచించారు. సంకురాత్రి ఫౌండేషన్ సహకారంతో వివిధ అంశాలలో సమాజ సేవా కార్యక్రమాలు చేపడతామన్నారు. **ఖేలో ఇండియా ప్రాజెక్ట్‌లో భాగంగా జేఎన్‌టీయూకే స్టేడియంలో సింథటిక్ ట్రాక్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ఆంగీకరించిందని, దీనికి కాకినాడ ఎంపీ వంగా గీతా** విశ్వనాథ్ ఎంతగానో కృషి చేశారన్నారు.

వర్సిటీ పూర్వ విద్యార్థి తూర్పుగోదావరి జిల్లా సబ్ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ఆలస్యం చేయకుండా అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. సివిల్స్, గేట్/క్యాట్/జీఆర్ తదితర పోటీ పరీక్షల ద్వారా లభించే అవకాశాలపై విద్యార్థులకు అవగాహన కలిగించాలన్నారు. మాజీ ఉపకులపతులు వీఎస్ఎస్ కుమార్, ఎం.రామలింగరాజు, ఆదికవి నన్నయ యూనివర్శిటీ ఉపకులపతి కె.పద్మరాజు యూనివర్శిటీలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు.

అనంతరం జేఎన్‌టీయూకే పూర్వ విద్యార్థి, తూర్పుగోదావరి జిల్లా సబ్ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డికి యంగ్ అచీవర్ అవార్డును అందజేయగా న్యాక్ ఏప్లస్‌ప్లస్, ఏ ప్లస్ గ్రేడ్ సాధించిన కళాశాలలకు గేట్/క్యాట్ పరీక్షలలోను, క్రీడా విభాగాలలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు అతిథుల చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందజేశారు. అనంతరం చలమలశెట్టి సునీల్ ఫౌండేషన్ సహకారంతో రూ.5 కోట్ల సీఎస్ఆర్ నిధులతో చేపడుతున్న వర్సిటీ ప్రాంగణ సుందరీకరణ కార్యక్రమాన్ని ఉన్నత విద్యామండలి చైర్మన్ కె.హేమచంద్రారెడ్డి మొక్కలను నాటి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ డైరెక్టర్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఒకటి నుంచి మూడో దశ రీ సర్వే

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రీసర్వేలో భాగంగా ఫేజ్ 3లో జిల్లాలోని 88 గ్రామాల్లో సెప్టెంబర్ ఒకటి నుంచి రీసర్వే నిర్వహించాల్సి ఉందని జిల్లా జాయింట్ కలెక్టర్, ఇన్‌చార్జి కలెక్టర్ ఎన్. తేజ్ భరత్ అన్నారు. ఆయన బుధవారం సర్వే, రెవెన్యూ తదితర శాఖల అధికారులతో కలెక్టర్ చాంబర్ నుంచి జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ జిల్లాలో తొలిదశలో 45 గ్రామాల్లో, రెండో దశలో 55 గ్రామాల్లో రీసర్వే జరిగిందన్నారు. మూడో దశకు సంబంధించి రాజమహేంద్రవరం డివిజన్‌లో 37, కొవ్వూరు డివిజన్‌లో 51 గ్రామాల్లో చేపట్టనున్న రీసర్వేకు అనుగుణంగా క్షేత్ర స్థాయిలో సిబ్బందిని సిద్ధం చేసుకుని కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. కోరుకొండ మండలంలో 16 గ్రామాలు, సీతానగరంలో 8, రాజానగరంలో ఒకటి, రాజమహేంద్రవరం రూరల్‌లో మూడు, రంగంపేటలో ఒకటి, గోకవరంలో ఆరు, కడియం రెండు, నిడదవోలులో 12, చాగల్లులో రెండు, గోపాలపురంలో ఐదు, పెరవలిలో ఆరు, ఉండ్రాజవరంలో ఏడు, కొవ్వూరులో 8, తాళ్లపూడిలో రెండు, నల్లజర్లలో రెండు, దేవరపల్లిలో ఏడు గ్రామాల్లో రీసర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా సర్వే అధికారి పి.లక్ష్మణరావు, కలెక్టరేట్ సర్వే అధికారి జోషిలా, వి.శ్రీనివాస్, ఆర్డీవోలు, తహసీల్దార్లు, డివిజన్, మండల సర్వే అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సారా బట్టీ నిర్వాహకుడికి మూడేళ్ల జైలు

అనపర్తి: బట్టీ నిర్వహిస్తూ సారా విక్రయాలకు పాల్పడుతున్న కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు శిక్ష, రూ. 2 లక్షలు జరిమానా విధిస్తూ అనపర్తి జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి పి.చైతన్య బుధవారం తీర్పు చెప్పారు. ఎస్సై పి.అప్పారావు తెలిపిన వివరాల ప్రకారం 2021లో సారా విక్రయాలపై నిఘా ఉంచిన అప్పటి ఎస్సై పి.ఉమామహేశ్వరరావు మండలంలోని పులుగుర్త శివారులో సారా బట్టీ నిర్వహిస్తూ విక్రయాలకు పాల్పడుతున్న అదే గ్రామానికి చెందిన వనుము సత్తిబాబును అరెస్ట్ చేసి దర్యాప్తు నిర్వహించారు. నిందితుడిని అనపర్తి జేఎఫ్‌సీఎం కోర్టులో హాజరు పరచగా వాదోపవాదనల అనంతరం మేజిస్ట్రేట్ పి.చైతన్య పై విధంగా తీర్పుచెప్పారు. ఈ కేసులో ఏపీపీ బి.సిద్ధార్థ ప్రాసిక్యూషన్ నిర్వహించగా కోర్టు కానిస్టేబుల్ సీహెచ్ సతీష్ సాక్షులను హాజరుపరిచినట్లు ఎస్సై తెలిపారు.

ఘోర రోడ్డు ప్రమాదం

- జాతీయ రహదారిపై రెండు కార్లు, లారీ ఢీ
- ఇద్దరు మృతి, తొమ్మిది మందికి గాయాలు
- మృతులు కోనసీమ జిల్లా వాసులు

కృత్తివెన్ను (కృష్ణా జిల్లా): రెండు కార్లు, లారీ ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు మృతి చెందడంతో పాటు మరో తొమ్మిది మంది తీవ్రగాయాల పాలయ్యారు. ఈ ఘోర రోడ్డు ప్రమాదం కృష్ణాజిల్లా కృత్తివెన్ను మండలం సంగమూడి సమీపంలో 216 జాతీయ రహదారిపై బుధవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో సంభవించింది. ముందు వెళ్తున్న లారీని కారు ఓవర్ టేక్ చేస్తున్న క్రమంలో ఈ ప్రమాదం జరిగినట్లు గుర్తించారు. కృత్తివెన్ను పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..

అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం మొగళ్ళమూరు తూర్పుచెరువు నుంచి ఓ కుటుంబంలోని ఇద్దరు మహిళలు, నలుగురు చిన్నారులు, కారు డ్రైవర్‌తో కలిసి మొత్తం ఏడుగురు గుంటూరు బయలుదేరారు. అక్కడి దేవదాసు చర్చిలో దాసుబాబుకి మొక్కు తీర్చుకోవడానికి వీరంతరూ బుధవారం ఉదయం 6 గంటలకు బయలుదేరారు. అల్లవరం మండలం మొగళ్ళమూరుకు చెందిన తెన్నేటి అనామణి, గోడికి చెందిన మడికి రాజేశ్వరి, మడికి మెరాకిల్, మడికి షారోన్ జ్యోతి, మడికి రమ్య, మడికి దాసుబాబు కారులో ఉన్నారు. మొక్కులు తీర్చుకుని మధ్యాహ్నం తిరుగు ప్రయాణమయ్యారు. యలవర్తి అఖిలేష్, యలవర్తి రవి, దేవరకొండ నాగబసవయ్య, అజయ్‌కుమార్ నర్సాపురం నుంచి అవనిగడ్డకు కారులో వెళుతున్నారు. సంగమూడి సమీపానికి వచ్చే సరికి లారీని తప్పించబోయి రెండు కార్లు ఎదురెదురు ఢీకొన్నాయి. ఈ ఘటనలో గుంటూరు నుంచి మొగళ్ళమూరు వెళుతున్న కారులోని తెన్నేటి అనామణి (70) ఘటనా స్థలంలోనే మరణించింది. అదే కారు డ్రైవర్ అల్లవరం మండలం అల్లవరం పాలెంనకు చెందిన పెయ్యల బాలస్వామి(20) తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్సపొందుతూ మరణించాడు. ఈ కారులోని రాజేశ్వరీతో పాటు నలుగురు చిన్నారులకు తీవ్ర గాయాలయ్యాయి. భర్తతో గొడవల కారణంగా ఐదు నెలలుగా రాజేశ్వరీ తన పిల్లలతో పుట్టింట్లో ఉంటోంది. భర్త మడికి చిరంజీవి ప్రైవేటు లైన్‌మెన్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు.



కారులోనే మృతిచెందిన అనామణి



ప్రమాదంలో పూర్తిగా ధ్వంసమైన కారు

మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలింపు

ఈ ప్రమాదంలో మరో కారులోని నాగబసవయ్య, రవిలకు తీవ్రగాయాలు కాగా, అఖిలేష్, అజయ్‌కుమార్‌లకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులందరినీ 108, ఎన్‌హెచ్ అంబులెన్సుల్లో మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులతో పాటు కృత్తివెన్ను పోలీసులు సకాలంలో స్పందించిన తీరు ప్రశంసనీయం. ప్రమాద విషయాన్ని తెలుసుకున్న వెంటనే బందరు రూరల్ సీఐ వీరప్రసన్నగౌడ్, బంటుమిల్లి ఎస్ఐ పైడిబాబులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు సీఐ తెలిపారు.



గాయాలపాలైన మహిళ, చిన్నారులు

12 ఏళ్ల తర్వాత జంట హత్య కేసు కొట్టివేత

- బాధితుల ఆందోళన
- విరవాడలో ఉద్రిక్తత

కాకినాడ లీగల్: పిఠాపురం మండలం విరవాడ గ్రామంలో 12 ఏళ్ల క్రితం జరిగిన జంట హత్య అప్పట్లో సంచలనమైంది. నేరం రుజువుకాకపోవడంతో ఈ కేసు కొట్టివేస్తూ కాకినాడ మూడో అదనపు జిల్లా జడ్జి పి.కమలాదేవి బుధవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం పిఠాపురం మండలం విరవాడ గ్రామానికి చెందిన కూరాకుల పుల్లయ్య, కూరాకుల శ్రీధర్, జవ్వాది సత్యనారాయణ, కోలా రాజు, కూరాకుల శేషారావు, కూరాకుల శ్రీను కలిసి 2012లో అదే ప్రాంతానికి చెందిన అడపా భీమరాజు,పెద్దిరెడ్డి వెంకటేశ్వరరావును హత్య చేశారు. పి.వీరభద్రరావు పై హత్యాయత్నం చేశారు. బాధితుల కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయగా పిఠాపురం రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. కోర్టు విచారణలో నేరంరుజువు కాకపోవడంతో కేసు కొట్టివేస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

న్యాయం జరగలేదని కుటుంబ సభ్యుల నిరసన

కోర్టు తీర్పుతో తమకు న్యాయం జరగలేదని ఇంకా బతుకు ఎందుకు అని కలెక్టరేట్ వద్ద బాధిత కుటుంబ సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. పెట్రోల్ సీసాలతో వచ్చిన ముగ్గురు ఒంటిమీద పెట్రోలు పోసుకుని ఆత్మహత్య ప్రయత్నం చేశారు. కాకినాడ డీఎస్పీ మురళీకృష్ణారెడ్డి బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడడంతో సమస్య సద్దుమణిగింది. ఈ సందర్భంగా పి.వీరభద్రరావు, అంజువేణి మాట్లాడుతూ న్యాయం జరిగే వరకు పోరాడతామని పేర్కొన్నారు.



కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న బాధిత కుటుంబ సభ్యులు

విరవాడలో మోహరించిన పోలీసులు

పిఠాపురం: విరవాడకు చెందిన ఇద్దరు వ్యక్తులు హత్య కేసు తీర్పు నేపథ్యంలో బుధవారం పిఠాపురం మండలం విరవాడలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ముందు జాగ్రత్తగా పిఠాపురం సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసులు భారీగా మోహరించారు. జూన్ 10వ తేదీ 2012లో విరవాడకు చెందిన పెదిరెడ్ల వెంకటేశ్వరరావు, అడపా భీమరాజులు మోటారు సైకిల్‌పై పిఠాపురం నుంచి ఇంటికి వస్తుండగా నడివీధి రామకోవెల వద్ద దారి కాచిన దుండగులు వారిపై కత్తులతో విచక్షణారహితంగా దాడి చేయడంతో పెదిరెడ్ల వెంకటేశ్వరరావు అక్కడికక్కడే మృతి చెందగా అడపా భీమరాజు చికిత్స పొందుతూ మరునాడు మృతి చెందాడు. వీరభద్రరావుకి గాయాలయ్యాయి. న్యాయమూర్తి కేసును కొట్టి వేస్తు నిందితులను నిర్దోషులుగా ప్రకటించి తీర్పు వెలువరించారు. దీనిపై బాధిత కుటుంబీకులు కాకినాడలో ఆందోళనకు దిగిన నేపథ్యంలో గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యగా పోలీసులు మోహరించారు.



విరవాడలో మోహరించిన పోలీసులు

పిల్లి పిల్లలకు పాలిస్తున్న కుక్క



రాజులపాలెం గ్రామంలో పిల్లికి పాలు ఇస్తున్న కుక్క

పి.గన్నవరం: మండలంలోని రాజులపాలెం గ్రామంలో జాతి వైరాన్ని విస్మరించి ఒక కుక్క, పిల్లి పిల్లలకు పాలు ఇస్తున్న సంఘటన అందరికీ ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. రాజులపాలెంలో గ్రామ రెవెన్యూ సహాయకునిగా పనిచేస్తున్న కటికదల వెర్రియ్య తన ఇంట్లో కుక్కను పెంచుతున్నారు. ఆ కుక్క కొన్ని రోజులుగా రెండు పిల్లి పిల్లలకు పాలు ఇస్తోంది. ఈ విషయం తెలుసుకున్న స్థానికులు ఆసక్తిగా కుక్కను, పిల్లి పిల్లలను తిలకిస్తున్నారు.

డీఆర్ఎం ఆకస్మిక తనిఖీ

రాజమహేంద్రవరం సిటీ: రైల్వే ప్రయాణికులకు సంతృప్తికరమైన, నాణ్యమైన సేవలు అందించేందుకు అధికారులు నిరంతరం కృషి చేయాలని విజయవాడ డివిజన్ రైల్వే మేనేజర్ నరేంద్ర ఆనంద్‌రావు పాటిల్ అధికారులను ఆదేశించారు. బుధవారం కాకినాడ రైల్వే స్టేషన్‌లో ఇన్‌స్పెక్షన్ అనంతరం రోడ్డు మార్గంలో రాజమహేంద్రవరం చేరుకుని స్టేషన్‌లో ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఇటీవల నూతనంగా ప్రారంభించిన రైలు కోచ్ రెస్టారెంట్‌ను పరిశీలించి తినుబండారాల క్వాలిటీపై ప్రయాణికులను అడిగి తెలుసుకున్నారు. ప్రయాణికులకు నాణ్యతతో కూడిన ఆహారం అందించాలంటూ పలు సూచనలు చేశారు. అనంతరం రైల్వే స్టేషన్లో వెయిటింగ్ హాల్స్ పరిశీలించి టాయిలెట్స్ అపరిశుభ్రంగా ఉండటంతో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రయాణికులు వినియోగించే టాయిలెట్స్ ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచే విధంగా హెల్త్ అధికారి చర్యలు చేపట్టాలంటూ ఆదేశాలిచ్చారు. స్టేషన్ ఆవరణ, తూర్పు రైల్వేస్టేషన్‌లోని కౌంటర్, పార్కింగ్ ఏరియాలను పరిశీలించి మరింత అభివృద్ధి చేయాలని ఆదేశించారు. రైళ్లు రాకపోకలు సాగించే మూడు ప్లాట్ ఫాంలతో పాటు నిర్మాణం జరుపుకుంటున్న 4,5 ప్లాట్‌ఫాంలను పరిశీలించారు. ఫుట్ వే బ్రిడ్జిని పరిశీలించి పలు సూచనలిచ్చారు. ఈయన వెంట సీనియర్ డీసీఎం వి.రాంబాబు, స్టేషన్ మేనేజర్ గంగా ప్రసాద్, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ సైదయ్య, సీటీఐ చంద్రమౌళి, సిబ్బంది పాల్గొన్నారు.



రైల్వే స్టేషన్ తనిఖీ చేస్తున్న డీఆర్ఎం నరేంద్ర ఆనంద్ రావు పాటిల్

ఉత్సాహంగా జిల్లా అండర్–15 చెస్ పోటీలు

అమలాపురం రూరల్: కోనసీమ జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అమలాపురం లయన్స్ క్లబ్‌లో బుధవారం అండర్–15 చెస్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. జిల్లా చెస్ అసోసియేషన్ సెక్రటరీ తాడి వెంకట సురేష్ ఆధ్వర్యంలో జిల్లా నలుమూలల నుంచి అనేకమంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీల ద్వారా నలుగురు బాలురు, నలుగురు బాలికలను అనంతపురం జిల్లా సత్యసాయి జిల్లాలో జరగనున్న రాష్ట్ర అండర్–15 చెస్ పోటీలకు ఎంపిక చేసినట్లు సురేష్ తెలిపారు. విజేతలకు లయన్స్ ప్రతినిధులు జంపన సుమన్ వర్మ, గోకవరపు మల్లికార్జున, చిక్కాల సతీష్, శిష్టా శ్రీహరి, జిల్లా చెస్ అసోసియేషన్ సభ్యుడు కోట తిరుపతి శ్రీనివాస్, జీవీ కుమార్ బహుమతులు అందజేశారు. బాలురులో డి.గిరిమణి శేఖర్ ప్రథమ స్థానం, కేశనకుర్తి భార్గవ్ సాయి ద్వితీయ స్థానం, గుత్తుల వెంకట శివరామ్ తృతీయ స్థానం, పితాని రాఘవేంద్ర నాల్గవ స్థానం సాధించగా బాలికలలో గెద్దాడ దేవి అక్షయ ప్రథమ స్థానం, పనిశెట్టి ధరణి ద్వితీయ స్థానం, గిడుగు వాత్సల్య తృతీయ స్థానం, పితాని సాయిలిఖిత నాల్గవ స్థానం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.



రాష్ట్ర అండర్-15 చెస్ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో లయన్స్ ప్రతినిధులు

పెరుగుతున్న గోదావరి ఉధృతి

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజ్ వద్ద బుధవారం నీటి ఉధృతి మరింత పెరిగింది. దీంతో మిగులు జలాల విడుదలను పెంచారు. కాటన్ బ్యారేజ్ నుంచి బుధవారం 4,41,244 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజ్ వద్ద 10.90అడుగులకు నీటి మట్టం చేరింది. డెల్టా కాలువలకు సంబంధించి 13,200క్యూసెక్కుల నీటిని వదిలారు. ఎగువ ప్రాంతాలకు సంబంధించి భద్రాచలం వద్ద నీటి ఉధృతి స్వల్పంగా తగ్గింది. బుధవారం రాత్రి భద్రాచలం వద్ద 30అడుగులకు నీటి మట్టం చేరింది.

గేదె దూడ హతం

సీతానగరం: వెదుళ్లపల్లిలోని తన్నీరు మురళీకృష్ణకు చెందిన ఏడాది గేదె దూడను మంగళవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు హతమార్చారు. ఈ మేరకు మురళీకృష్ణ బుధవారం సీతానగరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఆ దూడను వెటర్నరీ డాక్టర్ భానుతేజ పోస్టుమార్టం చేశారు. కర్రలు, రాడ్లులతో అతి కిరాతకంగా హతమార్చినట్టు నిర్ధారించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై కె.చిరంజీవి తెలిపారు.

జీఎంసీలో వంద సీట్ల భర్తీ

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల (జీఎంసీ)లో 100 వైద్య విద్యార్థుల సీట్ల భర్తీ పూర్తయ్యింది. ఈ నెల నాలుగున కౌన్సెలింగ్ ప్రక్రియ మొదలుకాగా బుధవారం వంద మంది విద్యార్థుల చేరికతో మొదటి దశ ముగిసింది. ఆ వివరాలను వైద్య కళాశాల ప్రిన్సిపాల్ కె.సౌభాగ్యలక్ష్మి విలేకరులకు తెలిపారు. ఆలిండియా నీట్‌లో 15 శాతంలో 22 సీట్లకు ముగ్గురు, ఏ కేటగిరిలో 35 శాతం మొదటి దశలో 63 సీట్లకు 62, బి కేటగిరిలో సెల్ఫ్ ఫైనాన్స్‌లో 35 శాతంలో 46 సీట్లకు 28, సి కేటగిరి ఎన్ఆర్ఐ కోటాలో 15 శాతం సీట్లలో 19 సీట్లకు ఆరుగురు విద్యార్థులు చేరారు. 16 మంది వైద్యులు, నలుగురు హాస్టల్ అధికారులతో కలిపి మొత్తం 20 మందితో కూడిన బృందం కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహించింది. సీట్లు పొందిన విద్యార్థులకు మెడిసిన్ డిపార్ట్‌మెంట్, గైనిక్, ఈఎన్‌టీ, ఆప్తమాలజీ విభాగాల్లో మెడికల్ ఫిట్‌నెస్ నిర్వహించారు. రెండో దశ సీట్ల భర్తీని మరో మూడు రోజుల్లో ప్రారంభించనున్నారు. కౌన్సెలింగ్ ప్రక్రియలో అకడమిక్ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శివకుమార్, నోడల్ ఆఫీసర్ డాక్టర్ మనోజ్ పాల్గొన్నారు.

వాడపల్లి వెంకన్న రాబడి రూ.81.60 లక్షలు



ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి హుండీలను బుధవారం లెక్కించగా రూ.81,59,696 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. 28 రోజులకు హుండీలను లెక్కించగా ప్రధాన హుండీల నుంచి రూ.62,23,913, అన్న ప్రసాదం హుండీల నుంచి రూ.19,35,783 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. విదేశీ కరెన్సీ వచ్చిందన్నారు. బంగారం 16 గ్రాములు, వెండి 803 గ్రాములు వచ్చినట్లు వివరించారు. ఆలయ క్షేత్రపాలకుడు శ్రీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి ఆలయ హుండీలను 28రోజులకు లెక్కించగా రూ.2,00,147 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. హుండీల లెక్కింపు కార్యక్రమం ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు, పలివెల ఉమా కొప్పేశ్వరస్వామి ఆలయ ఈఓ ఎస్‌వీఎస్ఎస్‌వి ప్రసాదరాజు, పాడగట్లపల్లి ఉప్పలపాటి జానాకీయమ్మ అన్నదాన సత్రం ఈఓ మీసాల రాధాకృష్ణ పర్యవేక్షణలో హుండీలను లెక్కించారు. హుండీల లెక్కింపు కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పెన్మెత్స సురేష్‌రాజు, మన్యం బాను, ఏపుగంటి కనకరావు, శనగల సత్యనారాయణ, మెర్ల వెంకటేశ్వరరావు, రొట్టే దావీద్, ఆలయ పర్యవేక్షకులు ఆర్. శ్రీనివాసరావు, జూనియర్ అసిస్టెంట్ రామానుజన్ పాల్గొన్నారు.

సాక్షి ఫ్యామిలీ
IV
రాజమహేంద్రవరం
గురువారం ॥ 24-8-2023



ఆచంద్ర తారార్కం

ఈ మహిళల కీర్తి

'ఇస్రో'లో పనిచేసిన తొలి తరం మహిళా శాస్త్రవేత్తల మాటల్లో తరచు వినిపించే మాట...
'ఆరోజుల్లో ఇస్రోలో చా...లా తక్కువ మంది మహిళలు ఉండేవారు'
చంద్రయాన్-3కి సంబంధించి నిన్నటి ప్రత్యక్ష ప్రసారాన్ని గమనిస్తే... ఆ ప్రాజెక్ట్‌లో భాగమైన ఎంతోమంది మహిళా శాస్త్రవేత్తలు ఉత్సాహంగా కనిపిస్తారు.
మార్పు స్పష్టంగా కనిపిస్తుంది.
అది సంఖ్యాబలమే కాదు సామర్థ్య బలం కూడా.
'ఇస్రో' సాధించిన ఎన్నో విజయాలలో మహిళా శాస్త్రవేత్తలు భాగం అయ్యారు.
ముఖ్యంగా 'చంద్రయాన్-3' ప్రాజెక్ట్‌లో రీతూ కరిధాల్ నుంచి కల్పనా కాళహస్తి వరకు ఎంతోమంది మహిళా శాస్త్రవేత్తలు మేధోశ్రమ చేశారు. చారిత్రక విజయాన్ని సొంతం చేసుకున్నారు.
'ఇస్రో సైంటిస్ట్ కావాలనుకుంటున్నాను' అని కలలు కనే ఎంతోమంది అమ్మాయిలకు స్ఫూర్తినిచ్చే అసాధారణ విజయ గాథలు ఇవి.

రాకెట్ ఉమన్: రీతూ కరిధాల్



అన్ని దశలను పూర్తి చేసుకొని విక్రమ్ ల్యాండర్ చంద్రుడి దక్షిణ ధ్రువంపై అడుగు పెట్టిన క్షణం ఒక చారిత్రక సందర్భం. ఎంత కృషి చేస్తే ఒక విజయం సొంతం అవుతుందో చెప్పిన సందర్భం.

అమోఘమైన చారిత్రక విజయాన్ని దేశానికి అందించిన 'చంద్రయాన్-3'లో భాగమైన అనేకమంది మహిళలలో రీతు కరిధాల్ ఒకరు.

గత నెలలో...

మూడు దశలను పూర్తి చేసుకొని చంద్రయాన్-3 విజయవంతంగా నిర్దేశిత కక్ష్యలోకి దూసుకెళ్లిన తరువాత ఉత్తర్‌ప్రదేశ్‌లో లక్నోలోని ఒక ఇంట్లో ఆనందం అంబరాన్ని తాకింది. వారు ఆనందంతో బాణాసంచా కాల్చారు. మిఠాయిలను చుట్టుపక్కల వారికి పంచారు. ఇక నిన్నటి రోజు ఆ ఆనందం స్థాయి ఎల్లలు దాటి ఉండవచ్చు. ఇది కోట్లాదిమంది భారతీయుల ఇంట్లో కనిపించే సాధారణ దృశ్యమే కావచ్చు.

కాని ఆ ఇంటికి ఒక ప్రత్యేకత ఉంది.

ఆ ఇంట్లో పుట్టిన రీతూ కరిధాల్ ప్రసిద్ధ చంద్రయాన్-3 మిషన్ డైరెక్టర్.

మధ్యతరగతి కుటుంబంలో పుట్టిన రీతుకు ఆకాశం అంటే అంతులేని ఆసక్తి. అదేపనిగా నింగిలోకి చూసేది. ఏవేవో ఊహించుకునేది. అప్పటికి అవి శాస్త్రీయతకు నిలవని ఊహలు కావచ్చు. అయితే రీతూ కరిధాల్ శాస్త్రీయ రంగంలో దిగ్గజంగా వెలగడానికి ఉపకరించిన ఊహలు.

కట్ చేస్తే....

1997... భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో)లోకి అడుగు పెట్టింది రీతు. చంద్రుడిపై అడుగు పెట్టినంత ఆనందంగా అనిపించింది. 'ఇస్రో' గురించి వింటూ, చదువుతూ పెరిగిన రీతు అదే 'ఇస్రో'లో 'మిషన్ ఎనాలసిస్ డివిజన్'లో ఉద్యోగిగా చేరింది. అప్పట్లో 'ఇస్రో'లో తక్కువ మంది మహిళలు పనిచేసేవారు.

ఎక్కడికి వెళ్లినా ఒంటరిగానే వెళ్లేది. ఉదయం నుంచి రాత్రి వరకు పనిచేయాల్సి వచ్చేది.

అయినా సరే, ఎప్పుడూ భయపడేది కాదు.

అసలు సిసలు భయం మాత్రం తొలి టాస్క్ రూపంలో ఎదురైంది.

'నేను చేయగలనా?' అని మొదట ఆందోళన పడింది రీతు.

చేతులెత్తేయడం తేలిక. 'చేయగలను' అనుకోవడం కష్టం. అయితే కష్టపడే వారే విజేతలవుతారు.'యస్ నేను చేయగలను' అంటూ తొలి టాస్క్‌ను విజయవంతంగా పూర్తి చేసి 'భేష్' అనిపించుకుంది.

'నాకు అప్పగించిన టాస్క్‌ను సీనియర్‌లు చేసే అవకాశం ఉన్నప్పటికీ నన్ను వెదుక్కుంటూ వచ్చింది. ఇది నన్ను పరీక్షించడానికి వచ్చిందా? అదృష్టవశాత్తు వచ్చిందా? అనేది తెలియదుగానీ నా విజయానికి కారణం... ఫిజిక్స్, మ్యాథమేటిక్స్ చదువుకున్నాననే ధైర్యం కంటే నాపై నాకు ఉన్న ఆత్మవిశ్వాసం' అంటూ గతాన్ని గుర్తు చేసుకుంటుంది రీతు.

ఆ ఆత్మవిశ్వాసం అప్పుడే కాదు ఇప్పటికీ రీతు వెన్నంటే ఉంది. ఆ ఆత్మవిశ్వాసమే ప్రతిష్ఠాత్మకమైన 'మంగళయాన్ మిషన్'లో డిప్యూటీ ఆపరేషన్స్ డైరెక్టర్‌గా, చంద్రయాన్-2 మిషన్ డైరెక్టర్‌గా పనిచేయడానికి ఇంధనంగా మారింది. చంద్రయాన్-3తో రీతూ కరిధాల్ ఒక చారిత్రక విజయంలో భాగం అయింది.

శాస్త్రవేత్తలు కావాలనుకునే కలలు కనే అమ్మాయిలకు రీతు కరిధాల్ స్ఫూర్తి ఇస్తుంది.

'నా విజయ మంత్రం ఇది' అని ఆమె ఎప్పుడూ ప్రత్యేకంగా చెప్పలేదుగానీ పరోక్షంగా వినిపించే మాట...టైమ్ మేనేజ్‌మెంట్.

కాలం విలువ తెలిసిన వారే 'టైమ్ మేనేజ్‌మెంట్'ను ఇష్టంగా ఆచరిస్తారు. ఆ ఆచరణే ఎన్నో విజయాలను బహుమానంగా ఇస్తుంది.

స్ఫూర్తిదాయక శక్తిమంతులు



మహిళా శాస్త్రవేత్తలు, సిబ్బంది వేడుక

స్పేస్ మిషన్‌లలో భాగమైన మహిళా శాస్త్రవేత్తల గురించి మినీ వేద్ 'దోజ్ మాగ్నిఫిసియెంట్ ఉమెన్ అండ్ దెయిర్ స్టోరీస్' అనే స్ఫూర్తియదాయకమైన పుస్తకాన్ని రాసింది. ఈ పుస్తకంలో 'రాకెట్ ఉమెన్'గా పేరు గాంచిన రీతూ కరిధాల్ సక్సెస్ స్టోరీ కూడా ఉంది. 'కుటుంబ జీవితం, వ్యక్తిగత జీవితాన్ని సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లాను. వృత్తిపరమైన విజయాలకు కుటుంబమే పెద్ద బలం' అంటుంది రీతు.

'ఇస్రో'లో రీతులాగే ఎంతోమంది మహిళా శాస్త్రవేత్తలు ఉన్నతస్థానాల్లో ఉన్నారు. అయితే ఇది రాత్రికి రాత్రి వచ్చిన విజయం కాదని వారి ప్రయాణాన్ని పరిశీలిస్తే అర్థమవుతుంది. 'ఇస్రో'లో పనిచేయాలని అనుకోవడానికి కారణం నుంచి... ఎదుర్కొన్న ఒత్తిళ్ల వరకు వారి మాటల్లో కనిపిస్తాయి.

ఇస్రో స్పేస్ సైన్స్ ప్రోగ్రామ్ డైరెక్టర్‌గా పని చేసిన సీతా సోమసుందరం ఇలా అంటోంది...

'నేను ఇస్రోలో చేరిన కాలంలో ఇంజనీరింగ్, సైన్స్‌లలో మహిళలు చాలా తక్కువ మంది ఉండేవాళ్లు. కొందరు సీనియర్‌లకు కొన్ని అభిప్రాయాలు ఉండేవి. అందులో ఒకటి... మహిళలు ఎక్కువగా కష్టపడలేరు. పరిమిత పని గంటల్లోనే పనిచేయగలరు. ఇంటికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారు. అంకితభావం ఉండదు. అయితే ఇది తప్పుడు భావన అని ఇస్రోలో ఎంతోమంది మహిళా శాస్త్రవేత్తలు నిరూపించారు'. 'ఏదో ఉద్యోగం చేస్తున్నాను అనే భావన కాకుండా విజయంలో భాగం కావాలనే సంకల్ప బలం మహిళా శాస్త్రవేత్తలలో కనిపిస్తుంది. ఎన్నో విజయాలలో నిర్ణయాత్మకమైన పాత్ర పోషించారు. డెడ్ లైన్‌లను సవాలుగా తీసుకోవడం నుంచి మిషన్, నేవిగేషన్, కమ్యూనికేషన్, కంట్రోల్ సిస్టమ్, స్పేస్ క్రాఫ్ట్ డిజైన్, ట్రాకింగ్ లాంటి మేజర్ ఏరియాలలో కీలక పాత్ర పోషించి తమ సత్తా చాటారు' అంటుంది మంగళ్‌యాన్ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా పని చేసిన ఎస్.అరుణ. స్పేస్ సైంటిస్ట్‌లు అనగానే ఏవో గంభీరమై ఊహలు తారసపడతాయి. అయితే ఈ ఉమెన్ స్పేస్ సైంటిస్ట్‌ల మాటలు విన్న తరువాత 'అందరిలాగే సాధారణ జీవితం... కానీ అసాధారణ సంకల్ప బలం' అనే సత్యం ఆవిష్కారం అవుతుంది. 'ఇస్రోకు ఛైర్ ఉమన్ (ఛైర్ పర్సన్) ఎప్పుడూ?' అనే ప్రశ్న వస్తుంటుంది. 'ఇస్రో' విజయాలలో భాగం అవుతున్న మహిళల అంకితభావాన్ని చూస్తే ఆ ప్రశ్నకు సమాధానం చెప్పే రోజు ఎంతో దూరంలో లేదు' అనిపిస్తుంది. 'ఇస్రో'లో జెండర్-న్యూట్రల్ ప్రొఫెషనల్ ఎన్విరాన్‌మెంట్ ఉంటుందనే మంచి మాటలు కూడా దీనికి కారణం.

కొన్నిసార్లు లోతైన భావాలు పలకడానికి పదాలు, పుస్తకాలు తెల్లముఖం వేస్తాయి. కళ్లు మాత్రమే నిశ్శబ్దంగా చెబుతాయి. చంద్రయాన్-3 ల్యాండింగ్‌కు సంబంధించి నిన్నటి టీవీ ప్రత్యక్ష ప్రసారంలో మహిళా శాస్త్రవేత్తల కళ్లలో కనిపించిన ఉత్సాహాన్ని, అంకితభావాన్ని గమనిస్తే ఇంకా ఎన్నో విజయాలు వారి కోసం ఎదురు చూస్తున్నాయని అనిపిస్తుంది.

సంతోష క్షణాలు: కల్పనా కాళహస్తి



కల్పనా కాళహస్తిది ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లా. చెన్నైలో బి.టెక్ (ఈసీఈ) చదివారు. తండ్రి మద్రాసు హైకోర్టులో ఉద్యోగి. తల్లి గృహిణి. ఇస్రోలో పనిచేయాలని తన చిన్ననాటి నుంచి కలలు కనేది. అనుకున్నట్టుగానే 2000 సంవత్సరంలో ఇస్రోలో చేరారు. తొలుత శ్రీహరికోటలో ఐదేళ్ల పనిచేశాక బెంగళూరులోని శాటిలైట్ సెంటర్‌కు ట్రాన్స్‌ఫర్ అయ్యారు. కరోనా పాండమిక్ సమయంలో అనేక అవాంతరాలు వచ్చినప్పటికీ వాటిని సమర్థంగా ఎదుర్కొంటూ 'చంద్రయాన్-3' మిషన్‌లో అసోసియేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా ఉన్నారు. ఈమె గతంలో చంద్రయాన్-2, మంగళయాన్ ప్రాజెక్టుల్లోనూ కీలక బాధ్యతల్ని నెరవేర్చారు. ఆమె నైపుణ్యం, అంకితభావం, దూరదృష్టి వంటివి మిషన్ విజయవంతం కావడంతో గణనీయంగా తోడ్పడ్డాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఇవి చాలా సంతోషభరితమైన క్షణాలుగా ఎప్పటికీ ఉండిపోతాయి. చంద్రయాన్ 2 కాలం నుంచి లభ్యమైన ఎన్నో అనుభవాలతో ఈ మిషన్‌ను లోప రహితంగా రూపొందించాం అని చెప్పారు.

వినిపించే గొంతుక: పి.మాధురి



శ్రీహరికోట రాకెట్ లాంచింగ్ స్టేషన్ నుంచి ప్రజలకు బయటికి కనపడే అక్కడి సిబ్బంది/ సైంటిస్టుల్లో పిల్లల మాధురి ఒకరు. ఈమె షార్‌లోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్‌లో డిప్యూటీ మేనేజర్‌గా పని చేస్తున్నారు. రాకెట్ లాంచింగ్ సమయంలో వినిపించే వ్యాఖ్యానాలు, ప్రజలకు వివరించే అంశాల గొంతుక ఆమెదే.

వీళ్లే కాకుండా చంద్రయాన్-3 మిషన్‌లో మొత్తం 54 మంది మహిళా సైంటిస్టులు / ఉద్యోగులు / సిబ్బంది ఉన్నారు. వీళ్లలో చాలా మంది మహిళలు ఎంతో కీలకమైన బాధ్యతలు నెరవేర్చే డిప్యూటీ డైరెక్టర్ స్థాయి నుంచి ప్రాజెక్ట్ డైరెక్టర్ స్థాయి నుంచి అనేక స్థాయిల్లో పనిచేస్తూ... కీలకమైన, భారత్‌కు గర్వకారణమైన ఈ ప్రాజెక్టును విజయవంతం చేశారు.

సౌమ్యంగా సాధించింది



సౌమ్య ఈ తరం టెకీ.
సాంకేతికతను ఆరోగ్యానికి అద్దింది.
ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌తో వైద్యరంగంలో కొత్త ఒరవడి తెచ్చింది.

వైద్యరంగం, ఔషధాల తయారీ రంగాలు సాంకేతికతను అందుకోవాల్సినంత వేగంగా అందుకోవడం లేదనుకుంది సౌమ్య. 'మల్టిప్‌లెయిర్ ఏఐ' పేరుతో హెల్త్‌కేర్ రంగంలో ప్రవేశించింది. ఇంత సునిశితమైన, సంక్లిష్టమైన పరిశ్రమను నిర్వహించడం మగవాళ్లకే సాధ్యం అనే అభిప్రాయాన్ని చెరిపేసిందామె. 'మగవాళ్ల ప్రపంచం అనే భావన మహిళలు ప్రవేశించేటంత వరకే. ఒకసారి మహిళలు ప్రవేశిస్తే ఇక అది అపోహ మాత్రమేనని నిర్ధారణకు వచ్చేస్తాం. మా టీమ్ లో సగానికి పైగా మహిళలే. సేల్స్ విభాగంలో కూడా మహిళలు సమర్థంగా పని చేస్తున్నార'ని చెప్పింది. ఒక టెకీ హెల్త్‌కేర్ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టడానికి దారితీసిన పరిస్థితులను, హైదరాబాద్‌లో సంస్థ స్థాపించి సక్సెస్ అందుకున్న వైనాన్ని సాక్షితో పంచుకున్నారు సౌమ్య.



సౌమ్య

భారీ మూల్యం చెల్లించాం

"నన్ను హెల్త్‌కేర్ ఇండస్ట్రీలోకి రప్పించిన కారణాలు అత్యంత బాధాకరమైనవి. మాది ఉత్తరప్రదేశ్, ప్రయాగరాజ్ (అలహాబాద్). నాన్న రవిప్రకాశ్ శ్రీవాస్తవ ఐఏఎస్ ఆఫీసర్. నాన్న డయాబెటిస్‌తో బాధపడుతుండేవారు. రొటీన్ టెస్టులు, మెడికేషన్ ఇవ్వడంలో ఎక్కడో పొరపాటు జరిగిపోయింది. మా జీవితాలు భారీ మూల్యం చెల్లించుకున్న పొరపాటు అది. వైద్యుల నిర్లక్ష్యం, రాంగ్ మెడికేషన్ కారణంగా ఆయన హఠాత్తుగా ప్రాణాలు వదిలారు. నేనప్పుడు బీటెక్ సెకండియర్‌లో ఉన్నాను. ఆ తర్వాత కొద్దిసంవత్సరాల్లోనే అమ్మకు ఓవేరియన్ క్యాన్సర్ ఉన్నట్లు తెలిసింది. మేము తెలుసుకునేటప్పటికే వ్యాధి మూడవ దశకు చేరింది. చికిత్స మొదలు పెట్టినప్పటికీ ఆరు నెలలకే అమ్మను కూడా కోల్పోయాను. అలాంటి దయనీయమైన పరిస్థితుల్లోనే బిట్స్ పిలానీలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి హైదరాబాద్‌లోని ట్రిపుల్ ఐటీలో బయోటెక్నాలజీలో మాస్టర్స్ చేశాను. సాంకేతికత వేగంగా అభివృద్ధి చెందుతోంది. కానీ వైద్యరంగం ఆ వేగాన్ని అందిపుచ్చుకోవడంలో వెనకబడుతోంది. ఆ వెనుకబాటు తెచ్చిన నష్టంలో మా అమ్మానాన్నల మరణాలు కూడా భాగమేననిపించింది. ఈ రెండు రంగాల మధ్య ఉన్న అంతరాన్ని భర్తీ చేయాలనే సంకల్పం కలిగింది, చేయగలననే నమ్మకం కూడా. సమాచారలోపం తలెత్తని విధంగా మెడికల్ డాటాను పరిరక్షించగలిగే పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయడానికి పూనుకున్నాను. మల్టిప్‌లెయిర్ ఏఐ స్థాపించి ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ ఆధారంగా డాటా అనలైజేషన్, డాటా మెయింటెయిన్ చేస్తున్నాం. మా సంస్థకు 'ఐఎస్‌ఓ 27001' సర్టిఫికేట్ వచ్చింది. మా సర్వీస్‌ను దేశవిదేశాల్లో పెద్ద ఆరోగ్య సంస్థలు తీసుకుంటున్నాయి. పేషెంట్ కేర్‌లో మొదటిది పేషెంట్ ఆరోగ్య చరిత్ర, క్రమం తప్పని పరీక్షల ద్వారా వ్యాధులను తొలిదశలోనే గుర్తించడం, పరీక్షల నివేదికల నిర్వహణ ప్రధానమైనవి. ఇక్కడ పొరపాటు జరిగితే ప్రాణాలు దక్కవని చెప్పడానికి మా పేరెంట్సే ఉదాహరణ.

ఫాలో అప్ సర్వీస్

వ్యాధి నిర్ధారణ ఆధారంగా వైద్యం అందించిన తర్వాత తదనంతర పరీక్షలను, వైద్యాన్ని అందించాల్సిన సమయానికి ఫాలో అప్ చేయడం కూడా మా సర్వీస్‌లో భాగంగా ఉంది. అలాగే భవిష్యత్తులో టెలిమెడిసిన్ విస్తరించాల్సిన అవసరం ఉంది. వైద్యచికిత్సను కుగ్రామాలకు చేరడానికి చక్కటి మాధ్యమం ఇది. పేషెంట్‌ను ఉన్న చోటనే ఉంచి ఆరోగ్యపరిస్థితిని మానిటర్ చేయడం సాధ్యమవుతుంది. నేను చదివిన టెక్, బయోటెక్ పరిజ్ఞానం ఇందుకు దోహదం చేసింది. నాకు సవాళ్లు ఎదురయ్యాయా అంటే సవాళ్లు లేని ప్రొఫెషన్ అంటూ ఏదైనా ఉంటుందా? డిజిటల్ బ్రాండింగ్, మార్కెటింగ్‌లో అవరోధాలు వచ్చాయి. మా క్లయింట్ల సందేహాలను తీరుస్తూ, వాళ్లు సమాధానపడే వరకు సహనంగా వివరించాం. సవాళ్లకు సమాధానాలు వెతుక్కుంటూ ముందుకు పోవడమే సక్సెస్‌కు దారి తీస్తుంది. వైద్యుల నిర్లక్ష్యం కారణంగా మా నాన్నను కోల్పోవడమే నన్ను ఈ రంగం వైపు నడిపించింది. ప్రతి విజయంలో మా అమ్మానాన్న కనిపిస్తున్నారు" అని వివరించారు సౌమ్య.

– వాకా మంజులారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

బ్యూటిప్స్

అందంగా పెంచుకుందాం!





గోళ్లు ..పొడవుగా అందంగా ఉండే ఉండాలని ప్రతి అమ్మాయి కోరుకుంటుంది. కానీ కొందరిలో కొద్దిగా పెరగగానే విరిగిపోతుంటాయి. కొంతమందికి అసలు పెరగవు. దీంతో నెయిల్ పెయింట్ వేసుకోవాలంటే ఇబ్బంది. గోళ్లను చక్కగా పెంచే ఈ ఐదు చిట్కాలు పాటించి చూడండి మీ కోరిక తీరుతుంది..

- గోళ్ల పెరుగుదలను ప్రోత్సహించడంలో ఆలివ్ ఆయిల్ ముందుంటుంది. దీనిలోని విటమిన్ ఇ గోళ్లకు పోషణ అందించి చక్కగా పెరిగేలా చేస్తుంది. రాత్రి పడుకోబోయే ముందు కొద్దిగా ఆలివ్ ఆయిల్‌ను గోళ్లమీద రాసి మర్దన చేయాలి. రోజూ ఇలా చేయడం వల్ల గోళ్లకు రక్తప్రసరణ చక్కగా జరిగి గోళ్లలో పెరుగుదల కనిపిస్తుంది.
- టీస్పూను యాపిల్ సైడర్ వెనిగర్‌లో టీస్పూను వెల్లుల్లి తరుగు వేసి చక్కగా కలపాలి. ఈ మిశ్రమాన్ని గోళ్లపై రాసి పదినిమిషాల తరువాత కడిగేయాలి. క్రమం తప్పకుండా ఇలా చేస్తే గోళ్ల విరగకుండా చక్కగా పెరుగుతాయి.
- వెల్లుల్లి రెబ్బను రెండు ముక్కలు చేసి గోళ్లపై పదినిమిషాలపాటు రుద్దాలి. కొద్దిరోజుల్లోనే గోళ్ల పెరుగుదల కనిపిస్తుంది.
- ఆరెంజ్ జ్యూస్‌ను గోళ్లకు పూతలా అప్లైచేసి పదినిమిషాలు ఆరనివ్వాలి. తరువాత గోరువెచ్చని నీటితో కడిగేయాలి. ఇది గోళ్లను అందంగా పెరిగేలా చేస్తుంది.
- ఇవన్నీ చేయలేకపోతే కొబ్బరినూనెను గోళ్లపై రాసి రోజూ మర్దన చేయాలి. కొబ్బరినూనెలోని ఫ్యాటీ ఆమ్లాలు, ఇతర పోషకాలు గోళ్ల పెరుగుదలకు దోహదపడతాయి.

ఇంటిప్స్







- ఒక్కో నిమ్మకాయను అల్యూమినియం ఫాయిల్‌ల్లో చుట్టి రిఫ్రిజిరేటర్‌లో పెడితే ఎక్కువ రోజులపాటు తాజాగా ఉంటాయి.
- శాండ్ విచ్ మరీ మెత్తగా కాకుండా చక్కగా రావాలంటే... శాండ్ విచ్‌లో పెట్టే కూరగాయలు, బ్రెడ్ మయనేజ్, చీజ్ గది ఉష్ణోగ్రతలో ఉండేలా చూసుకోవాలి. ఇంతకు మించి వేడిగా ఉండే తేమ చేరి శాండ్ విచ్ మెత్తగా మారిపోతుంది.
- కొన్నిసార్లు పన్నీర్ ముక్కలు ఫ్రై చేసిన తరువాత గట్టిగా మారుతుంటాయి. ఇలాంటప్పుడు పన్నీర్ ముక్కలు ఫ్రై చేసిన తరువాత చల్లని నీటిలో ఐదు నుంచి పదినిమిషాలు ఉంచాలి. తరువాత కూరలో వేస్తే పన్నీర్ ముక్క మృదువుగా, మెత్తగా ఉంటుంది.

అబద్ధాలను నమ్ముతున్నారా?!

సైబర్ టాక్



నిజం నిలబడి ఉండగానే అబద్ధం ఊరంతా చుట్టి వస్తుందంటారు.. ఈ సామెత సోషల్ మీడియాలో కుప్పలు తెప్పలుగా పుట్టుకువచ్చే ఫేక్‌న్యూస్ విషయంలో సరిగ్గా సరిపోతుంది. ఈ ఫేక్ న్యూస్ వల్ల నిజమేదో తెలుసుకోవడం కష్టంగా మారింది. అబద్ధాన్ని నిజం అనుకునే ప్రమాదమూ ఉంటోంది. అలాగే.. ఫొటోలు, వీడియోలు కూడా ఫేక్‌వి పుట్టుకొస్తున్నాయి. లైవ్ వీడియోలోనూ ఇటీవల ఏఐ టెక్నాలజీ ద్వారా అబద్ధం కొత్తగా సోషల్‌మీడియాను ఏలుతోంది. నిజమేంటో తెలుసుకోవడానికి మనం చాలా ప్రయత్నాలు చేయాల్సి ఉంటోంది. ఎందుకంటే, అబద్ధాల వల్ల కలిగే మోసాలు ఎన్నో. వాటి బారిన పడకుండా జాగ్రత్త పడాలంటే ముందుగా నిజాలేమిటో తెలుసుకుందాం...

వార్తలకు సంబంధించిన సమాచారం, డేటా, నివేదికలు పూర్తిగా నిజమైనవి కానివి ప్రజల ముందుకు వస్తున్నాయి. అందుకని, మూలాధారాలు లేకుండా వచ్చిన సమాచారం అవాస్తవం అని గ్రహించాలి. అబద్ధపు వార్తలు విస్తృతంగా షేర్ అవుతుంటాయి. వీటికి ఎలాంటి సెన్సార్‌షిప్ ఉండదు.

నకిలీ వార్తల పుట్టుకకు..

తమకు తెలిసిన విషయాన్ని నలుగురికి తెలియజేయాలనే ఆత్రుత. స్వీయ లాభం, రాజకీయ ప్రభావం వల్ల ఇలాంటివి జరుగుతుంటాయి. కేవలం తమకు తెలిసినవి మరికొందరికి తెలియజేద్దామని నిజానిజాలు తెలుసుకోకుండా కొందరు అదేపనిగా షేర్ చేస్తుంటారు. సమాచారం అబద్ధమే కావచ్చు కానీ, దానిని షేర్ చేసే వ్యక్తి అది నిజమని నమ్ముతారు. తప్పుడు సమాచారం అని తెలిసీ ఉద్దేశపూర్వకంగానే షేర్ చేస్తారు. ఏదైనా సమస్యకు లేదా వ్యక్తికి సంబంధించిన కంటెంట్ అబద్ధమైతే మనల్ని ఆ వార్త తప్పుదారి పట్టించవచ్చు. ముఖ్యాంశాలు, విజువల్స్, క్యాప్షన్‌లు కంటెంట్‌కు సరిపోని విధంగా ఉంటాయి. మోసగించడానికి ఫొటోలు, కంటెంట్‌ను తారుమారు చేస్తుంటారు.

వాస్తవం తెలుసుకోవాలంటే..

- గూగుల్ రివర్స్ ఇమేజ్ చెక్ చేయాలి. లేదా ఫొటో వెరిఫికేషన్ కోసం www.tineye.comని ఉపయోగించాలి.
- ఫొటో లేదా వీడియో (https://www.invid-project.eu/tools-and-services/invid-verification-plugin/) కోసం ఇన్‌విడ్ టూల్‌కిట్ ఎక్స్‌టెన్షన్‌ని ఇన్‌స్టాల్ చేయాలి.
- ఫార్వర్డ్ చేసే ముందు ఏదైనా ఒక అంతర్జాతీయ ఫాక్ట్-చెకింగ్ నెట్‌వర్క్ ఆర్గనైజేషన్‌తో www.factly.in వాస్తవాన్ని చెక్ చేయాలి.

తనిఖీ చేసే విధానం..

- వీడియో మూలం ఎక్కడ ఉందో చెక్ చేయాలి. అది విశ్వసనీయమైనదే అని నిర్ధారించుకోవడానికి ప్రయత్నించాలి.
- సమాచారం నిజమైనదైనా ప్రత్యామ్నాయంగా ఇతర మూలాధారాల కోసం వెతకాలి.
- వీడియోలో అసహజమైన కదలికలు ఉన్నాయేమో గమనించాలి.
- డీప్ ఫేక్స్ గుర్తించడానికి 'డీప్ ఫేక్ డిటెక్షన్ మోడల్' వంటి స్పెషల్ సాఫ్ట్‌వేర్ అందుబాటులో ఉంది.
- వీడియోలోని సంఘటనలు నమ్మదగినవేనా? ఆ వీడియో ఏ సందర్భాన్ని బట్టి తీశారో ఆ పరిస్థితులను పరిగణనలోకి తీసుకోవాలి.
- వీడియోలో ఉన్న వ్యక్తిని మెయిల్, ఫోన్ ద్వారా సంప్రదించి, ప్రామాణికతను ధృవీకరించుకోవడానికి ప్రయత్నించవచ్చు.

ఇలా గుర్తించాలి...

డీప్ ఫేక్ వీడియో లేదా ఆడియోలో ఏవైనా లోపాలు ఉన్నాయేమో జాగ్రత్తగా పరిశీలించడం, వినడం చేయాలి.

- డీప్ ఫేక్ వీడియో లేదా ఫొటోలలో లైటింగ్ నీడలను చెక్ చేయాలి. కొన్నింటిలో నీడలు కచ్చితంగా కనిపించకపోవచ్చు. ఇవే కాకుండా ఇంకేమైనా లోపాలు ఉన్నాయేమో చెక్ చేయాలి.
- వీడియోలలోని బ్యాక్‌గ్రౌండ్ చెక్ చేయాలి. సబ్జెక్ట్‌కు వీడియోలోని వ్యక్తుల కదలికల సరిపోలకపోవచ్చు. అంటే, ఏఐ టెక్నాలజీ ద్వారా నకిలీ వ్యక్తుల సృష్టి అయి ఉండవచ్చు.
- వీడియోలో వ్యక్తి కనురెప్పలు ఆర్పుతున్నారో లేదో పరిశీలించాలి.
- లైవ్ వీడియోలో మాట్లాడుతున్నప్పుడు ముఖాన్ని ఎడమ లేదా కుడికి కదిలించమని సదరు వ్యక్తిని ఉద్దేశించి అడగాలి.



ఇన్‌పుట్స్:
అనీల్ రాచమల్ల,
డిజిటల్ వెల్‌బీయింగ్ ఎక్స్‌పర్ట్, ఎండ్ నౌ ఫౌండేషన్